
"ఏమండీ... మిమ్మల్నే...

హుం అప్పుడే నిద్రపోయారా? ఎందుకు నిద్రపోరు? నిద్రపోయే ఉంటారు. అడిగి వచ్చారు... నిద్రపొడి... పది గంట కొట్టే సరికల్లా నిద్రపోతారు. మగమహారాజులు కదా!

మేం మీలాగా అడిగి వచ్చామా? కన్నారా నిద్రపోయే సుఖం కూడా లేదు. ఛీ ఛీ ఈ ఆడ బ్రతుకే ఇంత... ఇరవై నాలుగు గంటలూ పని పని పని...





నాయుని కృష్ణమూర్తి

చచ్చిం తరువాత ఆ దేవుణ్ణి నిలదీసి అడగాలి. వచ్చే జన్మలో అయినా నన్ను మొగుడిగా పుట్టించు నాయనా అని. మొగుడయితే దర్జాగా తొమ్మి దింటికే పడక మీదికి ఎక్కేయొచ్చు. వంటిల్లు సర్దాల్సిన అవసగం లేదు. తలుపులన్నీ మూశామో లేదో అని...

అయ్యో... ముందు తలుపుకు గడి పెట్టలేదేమో...

ఏమండీ ఏమండీ... కొంచెం లేచి గడి పెట్టానేమో చూసి వస్తారా... అసలే రోజులు బాగుండడం లేదు. ఎక్కడబడితే అక్కడ దొంగతనాలు జరుగుతున్నాయి.

ఏమండీ మిమ్మల్నేనండీ... ప్లీజ్ ఒక్కమారు వెళ్లి చూడండి. ఈ లోపల నేను బాత్రూంలోకి వెళ్లి వస్తాను.

వినబడదు. నా మాట మీకు వినబడదు.

నా పిచ్చిగాని పెళ్లయి పదారేళ్లు గడిచిం తరువాత కూడా పెళ్లాం మాట మొగుడికి వినబడుతుందా?

నేను ఇంతగా గొంతు చించుకొంటున్నా మీకు వినిపించడం లేదు. సరే... ఇంటికి చుట్టాల్తోనో, స్నేహితుల్తోనో ఎవరన్నా వయసులో ఉన్న ఆడ పిల్లలు వస్తే వాళ్లు నంగినంగిగా మాట్లాడినా మీకెలా వినిపిస్తుందండీ?

పోయినవారం నా క్లాస్మేట్ లావణ్య దాని చెల్లెలు మనింటికి వచ్చారు. వాళ్లు రాకముందే ఎక్కడికో అర్జెంటుగా వెళ్లాలి అని బట్టలు వేసుకొని రెడీ అయిన మీరు వాళ్లను చూసి ఆగిపోయారు.

నేను గమనిస్తూనే ఉన్నాను. మీ కళ్లన్నీ లావణ్య చెల్లెలు పైనే.

మేము ముందు రూములో కూర్చుని ఏదో మాట్లాడుతున్నాము. మీరేమో బెడ్ రూములో కూర్చుని ఏవో పుస్తకాలు తిరగేస్తున్నట్టు నటిస్తున్నారు.

ఆ లావణ్య చెల్లెలు మంచి నీళ్లు అడిగింది. పక్కనే కూర్చున్న నాకయితే దాని నంగి మాటలు సరిగా వినిపించలేదు గాని ఎక్కడో ఉన్న మీకు ఎలా వినిపించింది?


ఇదిగో ఆ అమ్మాయి మంచినీళ్లు అడుగుతోంది చూడు అని పని కట్టుకొని లేచి వచ్చి చెబుతారా... అమ్మమ్మ! ఏం శ్రద్ధండీ! ఎంత అతిథి మర్యాద!

అవన్నీ వినబడతాయి. కంటికి కాస్త నదురుగా కనిపించే అమ్మాయి ఎవరు ఎలా మాట్లాడినా మీకు బాగానే వినిపిస్తుంది. నేను మాట్లాడితేనే మీకు వినబడదు.

అరగంట నుండీ కొట్టుకొంటున్నాను. తలుపుకు గడి వేసుందో లేదో చూడమని... మీకు వినబడదు.

ఇదీ న్యాయంగానే ఉంది. రాత్రి పడుకునే ముందర తలుపుకు గడి వేసుందో లేదో చూసుకోవాల్సిన బాధ్యత ఇంటి ఇల్లాలిది అని మీ స్థిరమైన అభిప్రాయం. తప్పునాదే... ఇలాంటి తప్పులు ఎన్ని చేసిం తర్వాత ఈ జీవితం తెల్లవారుతుందో ఏమో... కానివ్వండి. నేనే లేచి వెళ్లి గది సంగతి చూస్తాను.

రానురాను మతిమరుపు ఎక్కువ అవుతూ ఉంది. లక్షణంగా గడి పెట్టే ఉన్నాను. ఎప్పుడు పెట్టానో ఏమో మరచి పోయాను. మళ్లీ అనుమానం వచ్చింది. ఈ మధ్య ప్రతిదీ ఇలాగే జరుగుతోంది. అనుమానాలు ఎక్కువ అవుతున్నాయి.




ఈ జాడ్యం మీ వల్లనే నాకు వచ్చిందని అనుకొంటున్నాను. మీరు నన్ను ఏ విషయంలోనూ నమ్మరు. మీకు సంబంధించి నేను కూడా అలాగే అయిపోయాను.

అయినా మీకీ మధ్య చిత్రమైన అనుమానాలు వస్తున్నాయి ఎందుకండీ! నా వయసు ఎంత అనుకొంటున్నారు? నేనింకా బాలా కుమారినా? నలభైఏళ్లు దగ్గరి కొస్తున్నాయి. నేను ఈ వయసులో ఎప్పుడన్నా గుమ్మం ముందు నిలబడుకోవడం తప్పయిపోతుందా? బజార్లో ఎవరన్నా తెలిసినవాళ్లు కనిపిస్తే మాట్లాడ్డం తప్పా?

నేను ఎవరితో మాట్లాడినా వాళ్లు మీ మూలంగా పరిచయం అయిన వాళ్లే కాదా... అందరూ మీ స్నేహితులే కదా!

ఒక రోజు మీరు మీ స్నేహితుల్లో రాజశేఖర్ చెడ్డవాడని చెప్పారు. నిజమే కావచ్చు. మొన్న ఆ మహాశయుడు మార్కెట్ దగ్గర ఎదురుపడ్డాడు. కల్పించుకొని ఏదో మాట్లాడాడు. నేనెలా దులుపు కొని వచ్చేసేది? మీరు అతని గురించి చెప్పిన సంగతి నాకేమో గుర్తుంది. అయినా, మర్యాద కోసం నిలబడి మాట్లాడాను. అది మరీ అపరాధం అయిపోయిందా? ఈ ప్రపంచంలో కేవలం పవిత్రమైన వాళ్లతోనే మాట్లాడాలంటే సాధ్యమయ్యే విషయమేనా?

ఈ మధ్య స్వామీజీలు కూడా వార్తలలోకి ఎక్కుతున్నారు. పైకెళ్లిన తరువాత మోక్షం ఇప్పించమని లోపలి కెళ్తే ఇక్కడే చూపిస్తున్నారట.

ఎవర్ని నమ్మమంటారు? అయినా, ప్రతి ఒకరి జీవిత చరిత్రా తెలుసుకొని తరువాత మాట్లాడా లంటే సాధ్యమయ్యే విషయమేనా?

మీ సంగతేమిటి? మీరందరూ పవిత్రమైన వ్యక్తులతోనే మాట్లాడుతున్నారా? అన్ని వేళలూ నేను మీ వెంట ఉండను కాబట్టి మీ సంగతి పూర్తిగా చెప్పలేను. కాని, బజార్లో మీతోబాటు కలిసి వెళ్లేటప్పుడు మీ కళ్లు ఎలా ఎలా ఎవరెవరి మీద పడతాయో నేను చాలామార్లు చూశాను. మీ చూపులకు అర్థం చెప్పమంటే మీరేం చెప్పగలరు?

ఏమండీ... ఒక సంగతి ఖచ్చితంగా చెబుతాను. వినండి. ప్రతి మగవారూ తన పెళ్లాం తప్ప కనబడే ప్రతి ఆడదీ వ్యభిచారి అన్న దృష్టితోనే చూస్తాడు.

మీ మగ బుద్ధులు ఈ రోజుటివి కావు. సృష్టి మొదలయిం దగ్గర్నుండీ మీ ఆటలు ఇలాగే సాగుతున్నాయి.

వేదాలు రాసింది మీరే, పురాణాలు చెప్పింది మీరే, నీతి నియమాలు ఏర్పరచిందీ మీరే! పుణ్యకార్యాలు చేసి స్వర్గానికి వెళ్తే మీ కోసం రంభ, ఊర్వశి, తిలోత్తమ, మేనక ఎదురు చూస్తుంటారా?

పవిత్రంగా బతికి చనిపోయే ఆడవాళ్ల సంగతేమిటి? స్వర్గంలో వాళ్ల కోసం ఎవరు ఎదురు చూస్తుంటారు? ఆ ఊహనన్నా భరించగలరా మీరు?

మీకు స్వర్గంలో రంభ కావాలి కాని, మీ భార్యకు అదే స్వర్గంలో నలకూబరుడు అవసరం లేదు. ఈ ప్రశ్న నేను అడగడం లేదు. తస్లిమా నస్రీన్ ఎత్తి చూపే వరకూ చాలా మందికి ఇలా అడగాలన్న ఆలోచన రాలేదు.

ఈ లోకంలో న్యాయమే నాకు అర్థం కావడం లేదు. ఒక పని మగవాడు చేస్తే తప్పుకాదు. అదే ఆడది చేస్తే తప్పు.

నాలుగేళ్ల పెళ్లి చేసుకోకుండా ఉంటే డిగ్రీ పూర్తి చేసేదాన్ని. డిగ్రీ ఒకటి చేతిలో ఉంటే నా బతుకు ఎలా ఉండేదో ఏమో...

నా స్నేహితులు అంటూ ఉండేవారు. నువ్వు చదివితే పెద్ద ఆఫీసరువి అయిపోతావే అని... ఐఏఎస్సే పాసయి కలెక్టరు అయ్యే దాన్నేమో...

హుం... అవన్నీ తలచుకొని ఇప్పుడు బాధపడితే ఏం ప్రయోజనం? దేనికయినా పెట్టి పుట్టాలి అంటారు. నా నుదుటి మీద దేవుడు మొండి చేత్తో రాశాడు.

మంచం కోడు రాసుకొంటోంది. కొంచెం జరుగుతారా... ఈ మంచం పుట్టింటి నుండి తెచ్చానని హక్కుగా మిమ్మల్ని జరగమనడం లేదు. కొంచెం జరగండి. స్థలం సరిపోవడం లేదు.

నిద్రపోతూ పక్కకు దొర్లి కింద పడితే మీకే ఇబ్బంది. ఏ ఎముకన్నా విరిగితే తెల్లారి హాస్పిటల్‌కు తీసుకెళ్లాల్సి ఉంటుంది. మీకు ఇబ్బంది అవుతుదని మీ మేలు కోరే చెబుతున్నాను.

అయినా మీరు అంత శ్రమ తీసుకొంటారనే నమ్మకమయితే నాకు లేదు. ఏ ఆటోవాడి చేతిలోనో పదిరూపాయలు పెట్టి హాస్పిటల్‌కు తీసుకెళ్లమని చెప్పినా చెబుతారు. మీరు మాత్రం టింగు రంగా అని ఆఫీసుకు వెళ్తారు.

అయినా ఆ ఆఫీసులో ఏం పెట్టారని ఇరవై నాలుగ్గంటలూ దాన్ని పట్టుకొని వేళ్లాడుతూ ఉంటారండీ నాకర్థం కాదు. ఎప్పుడయినా సరదాపడి ఇంకో సెలవు పెట్టండి, ఎక్కడికయినా వెళ్దాము అంటే అమ్మో చాలా పని ఉంది అంటారు. నిజం చెప్పండి. నాకు తెలీక అడుగుతున్నాను. కేవలం పని చెయ్యడం అనే ఇంట్రెస్టుతోనే మీరు ఆఫీసుకు వెళ్తున్నారా?

ఎప్పట్నుంచో అనుకొంటున్నాను. ఒకమారు సడెన్‌గా మీ ఆఫీసుకు వచ్చి మీ సీటు చూద్దామని.

నా అనుమానం మీ ఆఫీసులో అదెవత్తో త్రిపురసుందరి ఉంటుంది. దాని కోసం మీరు ఆఫీసు, ఆఫీసు అని ఏడుస్తున్నారని అనిపిస్తుంది. అదేదో నిజమో అబద్ధమో తేల్చుకొంటే మీ సంగతి తాడో పేడో నేనూ తేల్చుకోవచ్చు.

దానికీ తీరిక దొరక్కుండా చస్తున్నాను.

కాస్త జరుగుతారా... హమ్మయ్య... ఈ రోజు గ్రహగతులన్నీ బాగా ఉన్నట్టున్నాయి. కొంచెం బెడ్‌షీటు కూడా ఇవ్వండి...

ఇది డబుల్ బెడ్‌షీటే... కొంచెం ఇవ్వొచ్చు... అయినా పెళ్లయిన కొత్తల్లో ఇలా అడుక్కొనే ఖర్మ ఉండేదా?

గువ్వల కాలం స్వర్ణయుగం అన్నట్టు ఏ ఆడదానికయినా పెళ్లయిన తర్వాత మూడేళ్లు జీవితంలో అత్యంత హాయిగా గడిచిపోతాయి.

ఏమండీ నిద్రపోయారా అని అడిగే ప్రశ్న ఉండదు.

కొంచెం జరుగుతారా అని అడుక్కోవలసిన పని లేదు.

బెడ్‌షీట్ కొంచెం ఇవ్వండి అని ప్రాధేయ పడవలసిన అవసరం అంతకన్నా లేదు.

తొమ్మిది కొట్టి కొట్టగానే - ఇంకా పని కాలేదా డియర్ - ఏమన్నా హెల్ప్ చెయ్యమంటావా -

వెధవ పెరుగు దానిక్కూడా తోడు కావాలా? దానికి నాతో పోటీ ఏమిటి? - మొన్న నువ్వు కొనాలి అన్నది ఏది? కాటన్ చీరే కదూ - రేపు సాయంత్రం అయిదింటికి రెడీగా ఉండు. వెళ్లి కొనుక్కొందాం - ఇదిగో నాకు నిద్ర ముంచు కొస్తోంది. ఆ పాత్రలు ఉదయం పనిమనిషి వచ్చి తీస్తుందిలే! నువ్వెందుకు అవస్థ పడతావు - సాయంత్రం ఆఫీసు నుండి వస్తూ మల్లెపూలు తెచ్చాను. చూళ్లేదా అద్దం ముందు పెట్టాను.

ఈ డైలాగులన్నీ ఎక్కడికి పోయాయండీ...

అసలు సంగతి మరచి పోయాను.

ఇవ్వాళ మన దాంపత్య జీవనంలో చారిత్రాత్మకమైన దినం.

మీరు... మీ చేతుల్తో స్వయంగా ఎంపిక చేసి నాలుగు మామిడి పళ్లు ఇంటికి తెచ్చారు. నా జన్మ ధన్యమయిపోయింది. ఈ బ్రతుక్కి ఇంత అదృష్టం ఉంటుందని నేను అనుకోలేదు.

ఏం పళ్లు తెచ్చారండీ... ఏం పళ్లు తెచ్చారు?

అసలు మీకేమయినా బుద్ధుందా? అసలు అవి మామిడి పళ్లేనా? సీజను అయిపోయేటప్పుడు కళ్లు మూసుకొని ఎవరన్నా కొంటారా?

మిమ్మల్ని ఎవరు అడుక్కొన్నారు పళ్లు తెమ్మని... ఇంటికి కావలసినవి అన్నీ మీరే తెస్తున్నారా? రెండ్రోజులకోమారు నేను మార్కెట్టుకు తెల్లారి పూటే ఛస్తున్నాను కదా! ఈ సీజన్లో ఇప్పటికి నేను పదమూడు సార్లు మామిడిపళ్లు తెచ్చాను. తండ్రీ బిడ్డలు బాగానే మెక్కారు కదా... మళ్లీ అంత డబ్బు పోసి మిమ్మల్ని మామిడి పళ్లు తెమ్మన్నది ఎవరు?

పైగా కిలో పదహారు రూపాయలా... అమ్మో అమ్మో కుళ్లిపోయిన ఆ మామిడి పళ్లకు పదహారు రూపాయలు పోసి వచ్చారు. మొన్న నేను మా తమ్ముణ్ని చూసి వస్తాను అంటే ఛార్జీలు లెక్క పెట్టారు. నెలకు ఇంతయితే సంవత్సరానికి ఎంత, జీవితం మొత్తానికి ఎంత అని వేలల్లో లెక్కలు తేల్చారు.

ఇంకా నయం... ఏడు జన్మలు మన దాంపత్యం గ్యారంటీ అని మొత్తానికి లెక్కలు వెయ్యలేదు.

అంత కళ్లు మూసుకుని ఎవరన్నా బేరం చేస్తారాండీ...

మాట్లాడరేమండీ...

మీరెందుకు మాట్లాడుతారు? నా చేత వాగించడంలోనే ఉంది మీ గొప్పతనం అంతా.

మీ ప్రతిభా పాటవాలలో కొంత భాగం పిల్లల పెంపకంలో కూడా చూపించవచ్చు కదా...

మీ పుత్రికా రత్నానికి పదహారేళ్లు నిండిపోయాయన్న సంగతి తమరికి గుర్తుందా... ఎప్పుడూ ఆఫీసు, మీ పనులు అంటూ ఉండిపోతే చాలా? పిల్లల విషయమేమిటి అని ఎప్పుడన్నా ఆలోచించారా?

పిల్లల గురించి ఆలోచించరు. పిల్లుల గురించి కూడా మీరు ఆలోచించరు. ఏమండీ ఇంట్లో పిల్లిని ఎవరికైనా పట్టించెయ్యమని మొన్న ఎప్పుడో చెప్పాను కదా... వద్దులెండి. ఇంట్లో ఎలకలు కూడా ఉన్నాయి. సూరత్‌లో ప్లేగు వచ్చిందట కదా... పాడు ఎలకలు అవేనటండీ ప్లేగును వ్యాప్తి చేసేది.


రేపు ఆఫీసునుండి వచ్చేటప్పుడు ఎలకల మందు తీసుకు రండి. ఆ మందు నేనేం తిని చావనులెండి... ఎలకలకే పెడతాను. మీరు భయపడకండి. అయినా నేను చస్తే బయటికి అందరికీ వినిపించేలా మీరు ఏడ్చినా మనసులో సంతోషపడతారేమోనని నాకెందుకో అనుమానంగా ఉంది. నా చావు సంగతి అలా ఉండనీ... పిల్లల విషయం చెప్పండి.

ఏమండీ అమ్మాయి ఇంత పెద్దది అయినా దానికి ఒక జత కమ్మలు చేయించలేదు, రెండు బంగారు గాజులు కొనిపెట్టలేదు, అని నేను అడగను. అదీ, వాడూ బుద్ధిమంతులుగా తయారయితే చాలు.

నా అనుమానం ఈ కాలం పిల్లలు భ్రష్టు పట్టకుండా పెద్దవాళ్లు అవుతారా అని. ప్రస్తుతం సమాజం అట్లా ఉందండి. నాకేదో భయంగా ఉంది.

ఏమండీ మీరు నమ్ముతారో, నమ్మరో వాళ్లు అస్తమానమూ క్లాసు పుస్తకాలు ముందేసుకొని చదువుతున్నారని మీరు భ్రమ పడుతున్నారేమో అది నిజం కాదు. టెక్స్ట్ పుస్తకాల మధ్య వాళ్లు తెలుగు పత్రికలు పెట్టుకొని చదువుతున్నారండీ...

వినిపిస్తోందా... తెలుగు పత్రికలండీ తెలుగు పత్రికలు. నేను చిన్నగా ఉండేటప్పుడు మా




సీనియర్స్ కొందరు రమణి, రాధిక, చిలక, గోరింక లాంటి బూతు పత్రికలు చదువుతుంటే నేనూ చూశాను వాటిని. వాటినిండా పచ్చి బూతులే! ఇప్పుడవి కనిపించడం లేదు. వాటిల్లో ఎలాంటి విషయాలు ఉండేవో ఇప్పుడు వచ్చే కొన్ని పత్రికల్లో కూడా అలాంటివి వస్తున్నాయండీ...

అలాంటి పత్రికలు చదువుతున్నారండీ మీ సంతాన రత్నాలు. పిల్లలు లేనప్పుడు నేనూ ఒకరోజు వాళ్లు చదివే పత్రికను ముందేసుకు కూర్చున్నారు. ఖర్మఖర్మ పచ్చి బూతులండీ వాటి నిండా... బాత్రూములోకి వెళ్లి చన్నీళ్లు ఒక బక్కెట్ నెత్తిన గుమ్మరించుకొంటే కాని నేను మామూలు మనిషిని కాలేకపోయాను.

అలాంటి వాటిని పిల్లలు చదివితే ఇంకేమైనా ఉందా... నడి రోడ్డులో బెడ్రూము సీనులు ఏర్పాటు చేస్తారు. అమ్మా తలనొస్తోంది అన్నంత క్యాజువల్‌గా అమ్మా నెల తప్పింది అబార్షను చేయించుకొనేదా అంటారు.

సినిమాలు కూడా అంతేనండీ... అంత మొరటుగా, పచ్చిగా నిజ జీవితంలో ఎవరన్నా మాట్లాడుతారాండీ... మీరేమో నెలకోమారు సినిమాకు రెడీ అయిపోతారు. సకుటుంబంగా వెళ్దామంటారు.

పిల్లల్ని పక్కన పెట్టుకొని తెలుగు సినిమా చూడ్డమా... సిగ్గుతో సగం చచ్చిపోవాలి. మీకయినా ఎలా బుద్ధి పుడుతుందండీ ఆ సినిమాలు చూట్టానికి. ఎదిగిన బిడ్డలు వాటిని చూస్తే ఎలా రియాక్టు అవుతారన్న ఆలోచన రాలేదా మీకెప్పుడూ?

రాలేదంటే మీ మనస్సు కూడా ఎప్పుడో భ్రష్టు పట్టి పోయి ఉంటుంది. ఎందుకంటే లోకం ఇలా మారిపోయింది. నాగరికత పెరిగిపోయింది అంటే దానర్థం ఇదేనా...

మనసుల్ని ప్రలోభ పెట్టడానికి, కరప్ట్ చెయ్యడానికి పత్రికలు, సినిమాలు, రాజకీయాలు, రౌడీయిజం ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయి.

ఏమోనండీ! నాకేం అర్థం కావడం లేదు. నా బాధల్లా రేప్పొద్దున మన పిల్లలు ఎలా తయారవుతారు అనే!

గొంతు తెగిన కోడిలాగా నేనింతసేపూ క్కొక్కొక్కో అంటున్నా బదులు చెప్పరేమండీ...

మీరెందుకు నోరు తెరుస్తారు? వాగి వాగి అదే నోరు మూసుకొంటుందిలే అని మీ అభిప్రాయం.

అమ్మో... పన్నెండు అవుతోంది. మళ్లీ తెల్లారి అయిదింటికే లేవాలి.

రేపు టిఫిన్‌కు ఏం చెయ్యమంటారు?

మాట్లాడరేమండీ...

పోనీ కొంచెం ఇటు తిరిగి కాస్త దగ్గరగా పడుకోండి. నిద్ర పట్టక ఛస్తున్నాను.